భూసార పరీక్ష.. పంటకు రక్ష

- భూసార ఫలితాలతో ఎరువుల ఆదా
- నమూనాల సేకరణలో మారిన విధానం
- నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1,580 శ్యాంపిల్స్ సేకరణ



మట్టిని వేరు చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

బొమ్మనహాళ్: పంటలు బాగా పండాలంటే నేల బాగుండాలి. భూమిలోని ప్రధాన పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు చేయించాలి. వాస్తవానికి 90 శాతం రైతులు పంటకు కావలసిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటల సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు తప్ప, దిగుబడులు పెరగడం లేదు. అంతే కాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి. పంట సాగు చేసే ముందు రైతులు భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి. పంట కోతలు ముగిసిన నెలరోజులకు మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించాలో తెలుస్తుంది. ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల అటు భూమికి, ఇటు పంటకు రక్షగా నిలుస్తుంది.

జీపీఎస్ విధానంలో మట్టి సేకరణ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో అమలు చేస్తూ రైతులకు మెరుగైన దిగుబడులు సాధించేలా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో భాగంగానే మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటోంది. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి, పంటల సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందుకోసం జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ద్వారా మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేస్తున్నారు.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్ల భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు పీహెచ్ (నైట్రోజన్) సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారంగా మారుతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకూ ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.20 శాతం వరకూ ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

మూడేళ్లకు ఒకసారి తప్పనిసరి..

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి, నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకో సారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో మేలు



భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చు. భూసార పరీక్షలు చేసి మండలంలో రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఇప్పటి వరకూ రాయదుర్గం నియోజవర్గ వ్యాప్తంగా 79 రైతు భరోసా కేంద్రాల నుంచి 1,580 భూసార పరీక్షలు చేశాం. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగబడి తగ్గిపోతుంది.

– అహమ్మద్ బాషా, ఏఓ, బొమ్మనహాళ్

మట్టి సేకరణలో జాగ్రత్తలు

- పొలంలో ఎరువులు వేసిన తరువాత నెల రోజుల వరకూ మట్టి సేకరించకూడదు. అదే విధంగా పంటకు నీరు పెట్టిన తరువాత , నీడ పడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలున్న చోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు.
- పంటకోత తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పైపొర నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలంలో మొత్తంగా 8–10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదుటి భాగాలను మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అర కిలో వచ్చే వరకూ చేస్తూ ఉండాలి.
- ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డి వేర్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తరువాత ప్లాస్టిక్ బ్యాగ్ లేదా పాలిథిన్ కవర్‌లో గాని నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.
- మట్టి సేకరణకు స్థానిక రైతు భరోసా కేంద్ర సిబ్బంది సాయం తీసుకుంటే వారు రైతు పొలంలోని మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతారు.

క్లుప్తంగా

ఎన్‌ఎస్ఎస్ శిబిరం ప్రారంభం


ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న అధ్యాపకులు

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నముసూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ సెల్ కో–ఆర్డినేటర్ ఆదేశాలతో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రహదారిలో గుంతలు పూడ్చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అష్రాఫ్ అలీ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవా భావం పెరిగి ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వస్తోందన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో గురువారం ఉదయం 6:30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కె.ఈశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తారని వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని దుద్దేకుంట సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తలారి రామాంజినేయులు, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు.

గాలీవాన బీభత్సం


ఐదుకల్లులో గాలీవానకు నేలకొరిగిన బొప్పాయి


శెట్టూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన గాలీవానకు పలు పంటలు దెబ్బతిన్నాయి. ఐదుకల్లు గ్రామంలో లింగప్పకు చెందిన ఐదెకరాల్లో సాగు చేసిన బొప్పాయి నేలకొరిగింది. చెట్లు నేలకూలడంతో కాయలు రాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. అలాగే శెట్టూరు, యాటకల్లు, కనుకూరు గ్రామాల్లో మామిడి తోట రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపుభారతి

బొమ్మనహాళ్: డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపుభారతి అన్నారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో తుంగభద్ర మండల సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు భారతి మాట్లాడుతూ..సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం, వడ్డీ లేని రుణాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు అన్ని విధాలుగా ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధే సాధించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సురేఖ, సీసీలు, మండల సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

ముగిసిన సవారమ్మ ఉత్సవాలు


ఎర్రంపల్లిలో సవారమ్మను ఊరేగిస్తున్న గ్రామస్తులు

గుమ్మఘట్ట: మండలంలోని ఎర్రంపల్లిలో సవారమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ప్రధాన వీధుల్లో అమ్మవారిని మేళతాళాలతో ఉత్సాహంగా ఊరేగించారు. ముత్తయిదువులు కలశాలను పట్టారు. బుధవారం వేకువజామున భక్తులు వేపచీరలతో ఆలయం చుట్టూ నియమనిష్టలతో ప్రదక్షణలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా పటిష్టమైన చర్యలు చేపట్టారు.

'జీడిపల్లికి నీరిచ్చిన ఘనత వైఎస్సార్‌దే'

- కాలవా.. నోరు అదుపులో పెట్టుకో
- సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం: మహానేత వైఎస్సార్ చలువతోనే అనంత లాంటి కరువు జిల్లాలో సాగునీటి రంగం సస్యశ్యామలమైందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హంద్రీ–నీవా ద్వారా జీడిపల్లి వరకు కృష్ణ జలాలు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్ కే దక్కుతుందన్నారు. జిల్లా రైతాంగంపై ఉన్న ప్రేమతోనే సాగునీటి రంగానికి పెద్దపీట వేశారన్నారు. తండ్రి బాటలోనే సీఎం జగన్ పయనిస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే వైఎస్ కుటుంబానికి తప్పా మరెవ్వరికి జిల్లాకు వచ్చి మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ విషయాన్ని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. జిల్లాకు వచ్చే అర్హత జగన్‌కు లేదని పిచ్చికూతలు కూస్తే జనమే తిరగబడి తంతారని హెచ్చరించారు.

రైతు ద్రోహి చంద్రబాబు..

రైతుల ద్రోహి చంద్రబాబు అని విప్ కాపు ఆరోపించారు. టీడీపీ హయంలో రైతు సంఘాలు బాబు వద్దకెళ్లి 50 శాతం రాయితీతో ఇస్తున్న బిందుసేద్య పరికరాలను 75 శాతానికి పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తే.. 50 శాతం కూడా భరించే శక్తి లేనప్పుడు వ్యవసాయం మానుకోండంటూ చులకనగా మాట్లాడిన దుర్మార్గుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. డ్రిప్ విషయం పై కాలవ మాట్లాడటం చూస్తే విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్ సీఎం అయ్యాక 90 శాతం రాయితీతో పరికరాలు ఇచ్చారన్నారు. ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని.. అయితే దాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ తొమ్మిది గంటల పాటు సరఫరా జరిగేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు.

మనసులో మాట బుక్కులో బాబు ఏం రాశాడో తెలుసా?

కాలవ..? ఇష్టమెచ్చినట్లు మాట్లాడే ముందు కొన్ని నిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు. సాగునీటి ప్రాజెక్టులపై నీవెమో బీరాలు పలికితే, నీ అధినేత బాబు మాత్రం దానికి విరుద్ధంగా మనసులో మాట బుక్కులో ఏం రాశాడో..? తెలుసా అంటూ నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టులపై పెట్టుబడులు పెడితే బ్యాంకు వడ్డీలకు సరిపోవని లిఖిత పూర్వకంగా రాసిన దుర్మార్గుడు చంద్రబాబు గుర్తు చేశారు. రుణమాఫీ పేరుతో బాబు వంచనకు గురిచేస్తే రైతు భరోసాతో ఆదుకున్న ఘనత జగన్‌కు దక్కుతుందని గుర్తు చేశారు. అడ్డదిడ్డంగా, దుర్మార్గంగా మాట్లాడే వక్ర బుద్ధి మానుకోవాలని హెచ్చరించారు.

వైఎస్సార్ జలకళపై సోషల్ ఆడిట్

కుందుర్పి: వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరంగా మారిందని స్పెషల్ ఆడిట్ డీఆర్‌పీలు లక్ష్మణమూర్తి, నాగరాజు, ఏపీడీ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తూముకుంట తెనగల్లు, ఎనుములదొడ్డి, బెస్తరపల్లి, యర్రగుంట తదితర గ్రామాల్లో జలకళ పథకంపై ఆడిట్ నిర్వహించారు. గ్రామాల్లో 190 బోరు బావులు తవ్వగా.. 176 బోరు బావుల్లో సమృద్ధిగా నీరు పడ్డాయని తెలిపారు. ప్రభుత్వం 176 మంది రైతులకు ఉచితంగా మోటార్లు స్టార్టర్లు డ్రిప్ పరికరాలు అందిజేసిందన్నారు. ఇలాంటి బృహత్తర పథకానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బీజప్ప, సర్పంచులు వరలక్ష్మి, మహాదేవమ్మ, విశాలాక్షి, మమత పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'


వజ్రకరూరు: కమలపాడులో కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


రాయదుర్గం: కల్యంలో పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, కమలపాడు సర్పంచ్ కురుబ తిరకమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమలపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పాలనకు మధ్య తేడాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురుబ అల్లెప్ప, సచివాలయ కన్వీనర్ మనోహర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్ రెడ్డి, చాకలి వెంకటేష్ పాల్గొన్నారు.

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని కల్యంలో బుధవారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. సర్పంచ్ పుష్పావతి, ఎంపీటీసీ అనిత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పథకాలను వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 60 వేల గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కల్యం సురేష్, వాల్మీకి నాగరాజు, వైస్ సర్పంచ్ గంగప్ప, డీలర్లు లోకేష్, ఆనంద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆస్తి పన్ను వసూళ్లు


ప్రత్యేక కౌంటర్‌లో ఆస్తి పన్ను చెల్లిస్తున్న యజమానులు

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ముందస్తుగా చెల్లిస్తే మొత్తం సొమ్ములో 5 శాతం రిబేట్ (రాయితీ) పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెలాఖరుకు రాయితీ చెల్లింపు గడువు ముగుస్తుంది. ఆస్తి పన్నులో 5 శాతం రాయితీకి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మున్సిపాలిటీలోని ప్రత్యేక కౌంటర్‌లో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లిస్తూ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. రాయదుర్గం పురపాలక సంఘంలో మొత్తం ఆస్తి పన్ను డిమాండ్ రూ.2.74 కోట్లు ఉండగా రాయితీ ప్రకటించిన తరువాత దాదాపు రూ.52 లక్షలు వసూలు చేసినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెలాఖరు వరకూ అవకాశం ఉన్నందున యజమానులు ముందస్తుగా పన్నులు చెల్లించి రాయితీ పొందాలని కోరారు. రాయితీ కల్పించిన విషయాన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కూడా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

బెట్టింగ్ ఆడితే కఠిన చర్యలు

రాయదుర్గం: ఐపీఎల్ బెట్టింగ్ ముఠాకు చెందిన 7 మంది అనుమానితులను బుధవారం ముందస్తుగా అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించినట్టు సీఐ యుగంధర్ తెలిపారు. బెట్టింగ్ ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడుగురిని డిప్యూటీ తహసీల్దార్ రఘు వద్ద బైండోవర్ చేయించారు. ఏఎస్ఐ వెంకటేశులు పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం

శెట్టూరు: వివిధ మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ బాషా, ఎస్ఐ యువరాజ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. 12 ద్విచక్ర వాహనాలకు గాను 7 వాహనాలను పలువురు దక్కించుకున్నారు. జీఎస్టీతో కలిపి ప్రభుత్వానికి మొత్తం రూ.1,15,758 ఆదాయం వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ముంపు బాధితులకు పరిహారం అందించాలి

- నార్పలలో సీఎం జగన్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే విశ్వ


సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: బెళుగుప్ప మండలం, జీడిపల్లి సమీపంలో రిజర్వాయర్ నిర్మించడంతో కింది భాగాన ఉన్న జీడిపల్లి గ్రామస్తులు ఊటనీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే విశ్వ తెలిపారు. వీరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పునరావాసం కల్పించేందుకు ప్రతిపాదిత రూ.82.12 కోట్లను వెంటనే విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. బుధవారం నార్పలకు విచ్చేసిన సీఎంను మాజీ ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను విన్నవించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంజూరు చేసి, రాజకీయ కారణాలతో ఆగిపోయిన రాకెట్ల–ఆమిద్యాల లిఫ్ట్ పనులు యుద్ధప్రతిపాదికన ప్రారంభించాలన్నారు. లిఫ్ట్ పూర్తయితే ఆమిద్యాల, రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో 8 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. లిఫ్ట్ నిర్మాణానికి ఇప్పటికే 70 వేల ఎకరాల భూసేకరణ జరిపి, కాలువ పనులు పూర్తి చేశారని తెలిపారు. అయితే అందుకు సంబంధించి రైతులకు అందించాల్సిన పరిహారం రూ.8.50 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఉన్న ప్రత్యేక కరువు పరిస్థితుల దృష్ట్యా నవరత్నాల్లోని పథకాలకు నిబంధనలు సడలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల వల్ల కొంతమంది అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇందులో 10 ఎకరాల మెట్ట, మగాణి ఉన్న వారికి కొన్ని సంక్షేమ పథకాలు అందడం లేదని సీఎంకు తెలిపారు.

ఇంటర్‌లో బాలికల హవా

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాల ఇంటర్ విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో సువర్ణ 455, వర్షిత 443, దీపిక 442 మార్కులు సాధించారు. సెకెండ్ ఇయర్‌లో పూజా బాయి 911 మార్కులు, గౌతమి 903, మేఘన 898 మార్కులు సాధించినట్లు ఎస్ఓ కమలమ్మ పేర్కొన్నారు.

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ ఇంటర్ బాలికల, బాలుర కళాశాలల్లో ఉత్తీర్ణత గత ఏడాది కంటే మెరుగుపడింది. మొదటి సంవత్సరంలో 95 మంది గాను 39 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సర ఫలితాల్లో 105 మందికి గాను 45 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల కళాశాలకు సంబంధించి మొదటి సంవత్సరం 89 మంది పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం ఫలితాల్లో 146 మందికి గాను 86 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మమత తెలిపారు. దేవి 975, సౌజన్య (952), మహేష్ 905 మార్కులు సాధించారు. మహాత్మ కళాశాల విద్యార్థిని గట్టు స్నేహ 966 మార్కులతో టాపర్‌గా నిలిచింది.

రాయదుర్గంటౌన్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బైపీసీ గ్రూప్‌లో 36 మందికి గాను 23 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 41 మందికి గాను 37 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ లీమారోజ్ తెలిపారు. రోజా 418, నందిని 410, స్రవంతి 409 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో గీత 956, సుకన్య 938, ఇందు 929 మార్కులతో శభాష్ అనిపించారు. అలాగే మోడల్ స్కూల్‌లో 53 మందికి గాను 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 85 మందికి గాను 61 మంది పాసయ్యారు.

బొమ్మనహాళ్: ఇంటర్ మొదటి సంవత్సరంలో 62.35 శాతం, ద్వితీయ సంవత్సరం 81.63 శాతం ఉత్తీర్ణులైన్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. శ్రీకాంత్ 898 మార్కులు, కె.మహాశ్రీ 391, అక్షయ 434 మార్కులు సాధించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం, ఆవులదట్ల గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, సేవాభావం కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా సురేష్



బొమ్మనహాళ్: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా సింగానహళ్లి గ్రామానికి చెందిన సురేష్ నియమితులయ్యారు. తనను ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా నియమించినందుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డికి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా మారుతీప్రసాద్



రాయదుర్గంటౌన్: స్థానిక పురపాలక సంఘంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా (టీపీఓ) ఏ.మారుతీప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఈయన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా (టీపీఎస్) రాయదుర్గం మున్సిపాలిటీలోనే బాధ్యతలు నిర్వహించారు. మళ్లీ పదోన్నతిపై టీపీఓగా ఇక్కడే నియమించడం జరిగింది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఆదాయం పెంపునకు కృషి చేస్తానని మారుతీప్రసాద్ పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాయదుర్గం రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ప్రాదేశిక, మండల ప్రాదేశిక, కో–ఆప్షన్ సభ్యులతో పాటు సర్పంచులు, మండలస్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన


హోతూరు రహదారి వద్ద ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఓ విమల

ఉరవకొండ: ఉపాధి హామీ పనులకు వంద శాతం కూలీలు హజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఓ విమల తెలిపారు. బుధవారం ఉరవకొండ పట్టణ శివారులోని హోతూరు రహదారి వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైన నమోదు అవుతుండటంతో కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లాలన్నారు. 10 గంటలకు పనులు ముగించాలన్నారు. ఎండ నుంచి రక్షణగా తలకు టవల్, టోపీలు ధరించాలన్నారు. మంచినీరు ఎక్కువగా తాగి నీరసం ఎక్కువగా ఉంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించాలన్నారు. మండలంలో ఇప్పటికే 90 శాతం మంది కూలీలు పనులకు హాజరవుతున్నారన్నారు. మరో నెల రోజుల్లో వందశాతం కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో బుధవారం సీపీఐ, సీపీఎం నాయకులు పర్యటించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఆరెళ్ల నాగరాజు అనే రైతు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.